# మహా సంకల్పం

మూలం : బెర్టోల్డ్ బ్రెఖ్ట్ (సాంగ్ ఆఫ్ రిజల్యూషన్) అనువాదం : ఏ.బి.కె. ప్రసాద్

తెలుసు మాకు తెలుసు -
మా దుర్బలత్వం జడత్వం
మీ దారుణ చట్టాలకు పటుత్వం,
ఈ బిక్కతనం బక్కతనం
ఉండదు కలకాలం
నేటి మీ శాసనాలే మా లక్ష్యశుద్ధికి
రేపటి వరిపిడి రాళ్ళు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా తలలకు పిస్తోళ్ళు ఎక్కుపెట్టి
తరిమి తరిమి చెరబడతారు మీరు,
కాని చిత్రహింసలకు
చెదరేదిలేదని, బెదరేదిలేదని
సంకల్పం సమష్టిగా చెప్పుకుంటాం.
బానిసత్వం మిత్తవను మించిన
ముత్తవ, హీనాతి హీనం!

తెలుసు మాకు తెలుసు - మా
ఆర్తి తీర్చకుండా మమ్ము
క్షుధార్తులుగానే ఉంచుతారు
ఆపన్నుల బతుకులను సంపన్నులకు
అప్పడాలు నైవేద్యాలుగా మార్చుతారు!
మేట వేసిన మీ గరిసెల
గుమ్మాల దరిచేరకుండా
అడ్డగిస్తున్న కంచుకోటల కవాటాలు
బద్దలు కొడతాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
మా చుట్టూ కొంపలెన్నో నిర్జనవాసాలు
అయినా నిరంతరం మేము నిర్వాసితులం
ఈ క్షణం నుండే దారుణాతిక్రమణకు
స్వస్తి చెప్పిస్తాం
గోడుమంటున్న మానవునికి
గూడు కల్పిస్తాం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
పూట బత్తెం పుల్ల వెలుగై
పూట గడవనిమ్మని సాగిలపడి ఇక
బామాలేది లేదు బతిమాలేది లేదు
కరాల సత్తువకొద్దీ మీ
కర్మాగారాలన్నీ రేపటినుంచే మా సొత్తు
ఇకపై నష్టాలు మీ వంతు,
లాభాలు మా వంతు
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు
పాలకుల బాసల యాసలు
కానేరవు పాలితుల బతుకుల బాటలు
స్వేచ్ఛాపథమే సుఖజీవన మార్గం
సుందర భవితవ్యం
మా చేతనా సహకార ఫలం
ఇదే మా సంకల్పం!

తెలుసు మాకు తెలుసు -
తుపాకీల 'తూర్య' నాదాలే
మీకర్థం కాగల ఘంటారావాలు
పాఠం గుణపాఠంగా నిరూపిస్తాం
రేపే బందూకులనే మీపై ఎక్కుపెడతాం
ఇదే మా సంకల్పం.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పరచిన ప్యారిస్ కమ్యూన్ (1871 మార్చి) సంఘటనలను చక్కగా చిత్రించిన బ్రెఖ్ట్ నాటకంలోనిది యీ గేయం. ఈ నాటకం పేరు "కమ్యూన్ రోజులు".